నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 20 మే 2024 | RANGAREDDY

# లాస్ట్‌మైల్ కనెక్టివిటీ..

## నైట్ లైఫ్‌కు అనుగుణంగా.. మెట్రో సేవలు

ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు కార్యాచరణ

వేళల పొడిగింపుతో ప్రయోజనం పొందేలా టైమ్ టేబుల్

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): ప్రయాణికులకు మరింత చేరువ కావాలన్న లక్ష్యంతో హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కార్యాచరణ చేపట్టింది. విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్ మహానగరంలో ప్రజల అలవాట్లు, అవసరాలు, జీవనశైలిలో గణనీయమైన మార్పు చోటు చేసుకున్నది. ముఖ్యంగా అర్ధరాత్రి 12 గంటల వరకు, ఆ తర్వాత తెల్లవారుజామున 3-4 గంటల నుంచే నగర వాసులు తమ రోజువారీ కార్యకలాపాల్లో నిమగ్నమైన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నగర వాసులకు పూర్తి స్థాయిలో మెట్రో సేవలు అందుబాటులో ఉంచేందుకు ఉన్న అవకాశాలపై మెట్రో అధికారులు క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేపట్టారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రజా రవాణా వ్యవస్థల్లో ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు, ఆ తర్వాత మెట్రో రైలు ప్రధానంగా ఉన్నది. ప్రైవేటు రంగంలో ఆటోలు, క్యాబ్‌లు, ద్విచక్రవాహనాలను గణనీయంగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా క్యాబ్ సేవలు అందించే సంస్థలు సైతం బాగా పెరిగాయి. అయితే



ముఖ్యంగా రాత్రి పది గంటల నుంచి 12 గంటలు, ఉదయం 4 నుంచి 6 గంటల మధ్య ప్రయాణికులకు ప్రజా రవాణా వ్యవస్థల కొరతను ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. ఈనేపథ్యంలోనే మెట్రో కారిడార్లు విస్తరించి ఉన్న 3 మార్గాల్లో మెట్రో రైళ్ల వేళలను పొడిగించడం ద్వారా ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయన్న దానిపై ఇటీవలే మెట్రో అధికారులు ప్రయోగాత్మకంగా సోమ, శుక్రవారాల్లో మెట్రో వేళల పొడిగింపును ప్రకటించారు. ఈ సమయంలోనే మెట్రో ప్రయాణికుల పెరుగుదలను అధ్యయనం చేసి, మరింత సమయం పెంచేందుకు అవకాశం ఉన్నదని మెట్రో అధికారి ఒకరు తెలిపారు.

### బస్సు, రైల్వే స్టేషన్‌లే లక్ష్యంగా మెట్రో సర్వీసులు.

రోజు వారీ ప్రయాణికులే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని మెట్రో సేవలను అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలో ఉన్న ఎంజీబీఎస్, సికింద్రాబాద్‌లోని జేబీఎస్ బస్ స్టేషన్‌లతో పాటు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నాంపల్లి(హైదరాబాద్) రైల్వే స్టేషన్, బేగంపేట, మలక్‌పేట రైల్వే స్టేషన్‌ల నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారి కోసం ఎలాంటి సమయాల్లో మెట్రో రైళ్లు అందుబాటులో ఉంచాలన్న దానిపై మెట్రో అధికారులు అధ్యయనం చేశారు. ఇప్పటికే 69 కి.మీ మేర మూడు కారిడార్‌లలో బస్సు, రైల్వే స్టేషన్‌లను అనుసంధానం చేస్తూ నిర్మించిన ఇంటర్ చేంజ్ మెట్రో స్టేషన్‌ల నుంచి ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు అవసరమైన ఏర్పాట్లపైనా ప్రత్యేకంగా సర్వే నిర్వహించారు

### మెట్రో రైళ్లు ఏ సమయంలో..

రెండో దశ మెట్రో విస్తరణ ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం ఉన్న మెట్రో కారిడార్‌లలో ప్రయాణికుల అవసరాలపై ప్రత్యేకంగా సర్వే చేశారు. ప్రయాణికుల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని బస్సు, రైల్వే స్టేషన్‌ల నుంచి రాకపోకలు సాగించే వారికి మెట్రో రైళ్లు ఏ సమయంలో అందుబాటులో ఉంచాలన్న దానిపై అధికారులు ప్రత్యేకంగా నిర్ణయం తీసుకున్నారు.

ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు, ఆర్టీసీ బస్సుల్లో రాత్రి 11-12 గంటల మధ్య, ఉదయం 4-6 గంటల మధ్య ఎక్కువగా దూర ప్రాంతాలకు వెళ్లే వారు అత్యధికంగా ఉన్నట్లు గుర్తించారు. మెట్రో నినాదమైన లాస్ట్ మైల్ కనెక్టివిటీలో భాగంగా ఇంటి నుంచి బయలు దేరింది.. మొదలు కొని చివరి గమ్య స్థానం చేరే వరకు మెట్రోను ప్రధాన ప్రయాణంగా మార్చుకునేలా.. మెట్రో వేళల పొడిగింపును ప్రయోగాత్మకంగా చేపట్టారు. కొత్త టైమ్ టేబుల్‌తో ఎక్కువ మంది ప్రయోజనం పొందేలా ఆయా ప్రాంతాలను, సమయాలను నిర్ణయించే పనిలో మెట్రో యంత్రాంగం నిమగ్నమై ఉన్నది.

## ఘనంగా అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): సాలార్‌జంగ్ మ్యూజియంలో ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్‌తో పాటు, సాలార్‌జంగ్ మ్యూజియం, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల, ఐఐటీ హైదరాబాద్, తెలంగాణ శిల్పకారుల సంఘం, తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఐకోమోస్(ICOMOS) సౌతిండియా జోన్ కాంక్లేవ్ నిర్వహించారు. మ్యూజియం, మ్యూజియాల నిర్వహణ, సంప్రదాయం- భవిష్యత్ సహకారం, మ్యూజియం ఎడ్యుకేషన్ అండ్ ఇట్స్ ఫ్యూచర్, మ్యూజియం ఎడ్యుకేషన్‌లో టెక్నాలజీ పాత్ర, వాయిస్ ఆఫ్ హెరిటేజ్, జాతీయ పురాతన, సాంస్కృతిక సంపదను వ్యాప్తి చేయడంలో మ్యూజియం పాత్ర, చేతివృత్తులు, డిజిటల్ ఇంటరాక్టివ్ అండ్ మ్యూజియం ఎడ్యుకేషన్ వంటి అంశాలపై నిపుణులు, చరిత్రకారులు, శిల్పాకళ నిపుణులు ప్రసంగించారు.

అనంతరం వర్క్‌షాప్ నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఐకోమోస్ ఇండియా సౌత్ జోన్ ప్రతినిధి ప్రొ. జీఎస్వీ సూర్యనారాయణ మూర్తి, సాలార్ జంగ్ మ్యూజియం ఏవో నాగేశ్వర్ రావు, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్, ఐఐటీ హైదరాబాద్ డిజైన్ విభాగం ప్రొ. దీపక్ జాన్ మాథ్యూస్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ బాబ్జీరావు, ఐకామ్-ఇంటర్‌కామ్ కార్యదర్శి నితిన్ తదితరులు పాల్గొన్నారు.



## పేద విద్యార్థులకు 'నవద్వీప' చేయూత



కొండాపూర్, మే 19 : పలు అనాథాశ్రమాల్లో ఉంటున్న చిన్నారుల విద్యాభ్యాసానికి హైటెక్‌సిటీలోని మై హోం నవద్వీప ఫౌండేషన్ ఆర్థిక సాయమందించింది. ఆదివారం ఆశ్రమ నిర్వాహకులకు ఫౌండేషన్ సభ్యులు రూ. 2,75,800ల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నవద్వీప ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ పలు అనాథ ఆశ్రమాల్లో ఉంటున్న 30 మంది చిన్నారులకు ఈ విద్యా సంవత్సరానికి అవసరమైన స్కూల్ ఫీజుల కోసం ఆర్థిక సాయమందిస్తున్నట్లు తెలిపారు. పేద, అనాథ పిల్లలకు అండగా నిలిచేందుకు తమ ఫౌండేషన్ ఎల్లవేళలా ముందుంటుందని చెప్పారు.

# పాలనకు చేయిచ్చారు!



- పంచాయతీల్లో నిధుల్లేక నీరసించిన గ్రామ పాలన
- కొత్త ప్రభుత్వంలో పడకేసిన అభివృద్ధి
- ప్రజా సమస్యల పరిష్కారంలోనూ స్తబ్దత
- సిబ్బందికి జీతాల్లేవ్..ట్రాక్టర్ల కిస్తీలకు డబ్బుల్లేవ్..
- పారిశుధ్యం, తాగునీటి నిర్వహణ అస్తవ్యస్తం
- పదేండ్ల కిందటి పరిస్థితులు మళ్లీ ప్రత్యక్షం!
- పెదవి విరుస్తున్న జిల్లా ప్రజానీకం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఐదు నెలలకు పైనే అయ్యింది. రాజకీయ హ డావుడి తప్పితే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులతో పాటు సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు శూన్యం. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వక పోగా..కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఫలితంగా జిల్లాలోని పంచాయతీల్లో పాలన పడకేసింది. కనీసం పారిశుధ్య సిబ్బందికి జీతాలు..ట్రాక్టర్లకు ఈఎంఐలు చెల్లించలేని దుస్థితి నెలకొన్నది. రోజురోజుకూ పెరిగిపోతున్న సమస్యలతో పదేండ్లుగా మాయమైపోయిన కష్టాలు నేటి కాంగ్రెస్ పాలనలో మళ్లీ ప్రత్యక్షమై పల్లె ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి.

- రంగారెడ్డి, మే 19 (నమస్తే తెలంగాణ)

### పంచాయతీల్లో ఆర్థిక సంక్షోభం..




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాలకు విడు దల చేస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన అందజేస్తున్నది. ఈ లెక్కన చిన్న పంచాయతీలకు ఏడాదికి కనీసం రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు నిధులు విడుదలవుతున్నాయి. పెద్ద పంచాయతీలకు రూ.40 లక్షల వరకు అందుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు బాగానే ఉన్నా..ఆ తర్వాత ఈ ఐదు నెలల కాలంలోనే పంచాయతీలు నిధుల కటకటను ఎ దుర్కొంటున్నాయి. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృ ద్ధి పనులకు సంబంధించి ఈ ఏడాది జనవరిలోనే గ్రామ సభలు నిర్వహించి ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 559 గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.115 కోట్లకు సంబంధించి ప్రణాళికలు తయారు చేసి ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేశారు. కేంద్రం నుంచి నిధులు గత రెండేండ్లుగా అంతంతమాత్రంగానే అందుతుండగా..ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు నయా పైసా కూడా విడుదల కాలేదు. దీంతో పంచాయతీల్లో ప్రగతి కుంటుపడుతున్నది.

### ట్రాక్టర్ల కిస్తీలకూ డబ్బుల్లేవ్..



జిల్లాలో 2019-20 సంవత్సర మధ్యకాలంలో పంచాయతీలు ట్రాక్టర్లను కొనుగోలు చేశాయి. పెద్ద పంచాయతీలు నగదు చెల్లించి కొనగా.. చిన్నపంచాయతీలు కిస్తీల రూపంలో కొనుగోలు చేశాయి. జిల్లాలో కొత్తగా ఏర్పడ్డ పంచాయతీల్లో గిరిజన తండాలే ఎక్కువగా ఉన్నాయి. అయితే చిన్న, చిన్న పంచాయతీలకు ట్రాక్టర్ల ఈఎంఐలను కట్టడం భారంగా మారింది. నెలవారీ ఇన్‌స్టాల్‌మెంట్ మిని మమ్ రూ.11వేల నుంచి రూ.15వేల వరకు చెల్లించాల్సి వస్తున్నది. వీటికితోడు డీ జిల్, మైనర్ మరమ్మతుల ఖర్చులు అదనం. కొన్ని గ్రామపంచాయతీల పాలకవర్గాలు ట్రాలీ, ట్యాంకర్లనూ రుణంపైనే తీసుకున్నాయి. చిన్న పంచాయతీల్లో పన్నులు ఎక్కువగా వసూలు కాకపోవడంతో ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులే వాటికి ఆధారం. ఖాళీ ఖజానాతో మెయింటెనెన్స్ చేయలేక హరితహారం మొక్కలకు నీటిని పట్టడం.. చెత్తను సేకరించడం వంటి కార్యక్రమాలను పంచాయతీలు సమర్థవంతంగా చేపట్టలేకపోతున్నాయి.



### నీరుగారుతున్న హరితహార లక్ష్యం..

నిధుల లేమీ కారణంగా పంచాయతీల్లో హరితహార లక్ష్యం కూడా నీరుగారుతు న్నది. కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చి ప్రతియేటా 70-80 లక్షల వరకు మొక్కలను నాటించింది. ఈ లెక్కన గత తొమ్మిదేండ్ల కాలంలో జిల్లాలో 8.27 కోట్ల మొక్కలను నాటగా పల్లెల్లో పచ్చదనం వెల్లివిరుస్తున్నది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి ప్రాధాన్యత తగ్గించి 2024 సంవత్సరంలో లక్ష్యాన్ని 25 లక్షలకు కుదించింది. నిధుల లేమీ.. ఎండల తీవ్రత.. భూగర్భజలాల కొరత వంటి ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో నర్సరీల్లో అంతంతమాత్రంగానే మొక్కల పెంపకాన్ని చేపట్టారు. అక్కడక్కడా మొక్కలు సంరక్షణ లేక ఎండిపోతున్నాయి. వాటి స్థానంలో కొత్త వాటిని నాటే పరిస్థితులు సైతం కనబడడం లేదు.



### పంచాయతీల్లో పాలన గాడి తప్పింది..



పంచాయతీల్లో పాలన గాడి తప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలకు పైసా కూడా కేటాయించకపోవడంతో ప్రత్యేక అధికారులు అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నారు. అంతేకాకుండా మౌలిక వసతులు సరిగ్గా లేక ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. సమస్యలు పెండింగ్‌లో పడుతున్నాయి. వచ్చేది వర్షాకాలం.. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటే ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉన్నది. ఇకపైనా పాలకులు స్పందించి వెంటనే గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

- ఇమ్రాన్, చేవెళ్లటౌన్

### పడకేసిన ప్రత్యేక పాలన ..

జిల్లాలోని 559 గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పాలన ఈ ఏడాది జనవరితో ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించక ప్రత్యేకాధికారులను నియమించి ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక పాలనను కొనసాగిస్తున్నది. 252 మంది గెజిటెడ్ అధికారులకు స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించింది. ప్రతిరోజూ పంచాయతీల్లో ట్రాక్టర్ సాయంతో పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. అలాగే బ్లీచింగ్ పౌడర్, తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్లు, మోటర్ల మరమ్మ తులు, వీధిలైట్లకు సంబంధించిన పనులను చేపడుతున్నారు. ఇందుకు సొంతంగా డబ్బులు ఖర్చు చేయాల్సిందే.. లేదంటే డబ్బులు తర్వాత ఇస్తామని చెప్పి పనులు చేయించాల్సి వస్తున్నది. పన్నుల రూపేణా వచ్చే ఆదాయం విద్యుత్తు బిల్లులకే సరిపోతుండడంతో సిబ్బందికి సైతం జీతాలు చెల్లించలేని దుస్థితి పంచాయతీల్లో నెలకొన్నది.



### హరితహారం మొక్కలను సంరక్షించాలి..



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా ఉన్నది. గత బీఆర్ఎస్ హయాం లో గ్రామాలు పచ్చదనంతో వెల్లివిరిశాయి. పల్లెల్లో పారిశుధ్యం, మొక్కల పెంపకం, హరితహారం నర్సరీల నిర్వహణ తదితర వాటికి మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం సక్రమంగా నిధులను విడుదల చేసి వాటి అభివృద్ధికి కృషి చేసింది. పల్లెలన్నీ పచ్చగా కళకళలాడాయి. ప్రస్తుత రేవంత్ సర్కార్ వాటిని పట్టించుకోవడంలేదు. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. హరితహారం నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు.

- సామ మల్లారెడ్డి, రైతు, దేవునిఎర్రవల్లి, చేవెళ్ల

### పల్లెల్లో ఎక్కడి చెత్త అక్కడే



బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడేవి. గతంలో క్రమం తప్పకుండా పారిశుధ్య సిబ్బంది ఇంటింటి నుంచి చెత్తను సేకరించి కంపోస్ట్ యార్డులకు తరలించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేవారు. ప్రస్తుతం పల్లెలను అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి పారిశుధ్యం లోపిస్తున్నది. మురుగు కాల్వలపై ఉన్న మ్యాన్ హోల్ మూతలు పగిలి ప్రమాదకరంగా మారాయి. రాత్రివేళల్లో వీధిలైట్లు వెలుగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలి. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలి.

- రమేశ్, నందిగామ

# గెలుపు ఉత్సాహం..

ఉప్పల్ వేదికగా ఆదివారం జరిగిన ఐపీఎల్ చివరి లీగ్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. పంజాబ్ కింగ్స్‌పై 4 వికెట్ల తేడాతో ఎస్ఆర్‌హెచ్ ఘన విజయం సాధించింది. మరోవైపు మ్యాచ్‌ను చూసేందుకు క్రికెట్ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మైదానంలో సందడి వాతావరణం నెలకొన్నది. మ్యాచ్ సాగుతున్నంత సేపు.. ప్రేక్షకులు కేరింతలు కొడుతూ.. తమ అభిమాన క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

